
సాక్షి గుంటూరు

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 4,012 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 2,220 క్యూసెక్కులు వదిలారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ నుంచి వస్తున్న వరదతో పులిచింతల ప్రాజెక్టు నీటిమట్టం గురువారం సాయంత్రానికి 34.108 టీఎంసీలకు చేరింది.



కార్తికేయుని సేవలో..

మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సెంట్రల్ రైల్వే ఆడిట్ ప్రిన్సిపల్ డైరెక్టర్ సుహాసిని ఎస్ గోట్మేర్ గురువారం దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ



నరసరావుపేట: పల్నాడు జిల్లాకు ఐఏఎస్ హోదాలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణకు వచ్చిన కేఆర్ కల్పశ్రీ గురువారం నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించారు. శిక్షణలో భాగంగా రెండు వారాలపాటు మున్సిపల్ కమిషనర్‌గా పట్టణ ప్రజలకు సేవలను అందించనున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, మున్సిపల్ పరిధిలో అడ్మినిస్ట్రేషన్, పరిపాలన, వ్యవహారాల గురించి తెలుసుకోనున్నారు. బాధ్యతల స్వీకారం అనంతరం ఆమె ప్రస్తుత కమిషనర్ ఎం.రామ్మోహన్, ఎంఈ డి.శ్రీనివాసరావు, డీఈ ఒ.శ్రీనివాసరావు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. అనంతరం వారితో కలిసి పాతూరులోని 26, 27 వార్డు సచివాలయాలను సందర్శించారు. విధుల గురించి ఆరా తీశారు.

7న సీనియర్ రెసిడెంట్‌లకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాలలో ఈనెల 7న సీనియర్ రెసిడెంట్స్‌కు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి తెలిపారు. క్లినికల్, నాన్ క్లినికల్, స్పెషాలిటీస్, సూపర్ స్పెషాలిటీస్ వైద్యులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తు, ఇతర వివరాలకు గుంటూరు మెడికల్ కాలేజీ.ఈడీయూ.ఇన్. వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 514.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 856.60 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 87,518, రోజా నుంచి 886 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

అనారోగ్యంతో పోలీస్ జాగిలం మృతి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని పోలీస్ జాగిలం (ట్రాకర్ షాడో డాగ్) అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ జాగిలానికి పూలమాలతో నివాళులర్పించారు. ట్రాకర్ షాడో డాగ్ 2013లో శిక్షణ పొందింది. గుంటూరు, నరసరావుపేట, పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లోని పలు చోరీలు, హత్య కేసుల్లో నిందితులను పట్టిచ్చింది. విన్యాసాలు ప్రదర్శించి, పోలీస్ ఉన్నతాధికారుల ప్రశంసలను అందుకుంది. ఏఎస్పీ కె.కోటేశ్వరరావు (ఏఆర్), ఆర్ఐలు థామస్ రెడ్డి, రాజారావు, రమేష్‌కృష్ణన్, పోలీస్ జాగిలం షాడో హ్యాండ్లర్స్ కానిస్టేబుళ్లు జీఏస్ నాగకుమార్, నాగేంద్రబాబు కూడా జాగిలానికి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు (క్రీడలు): గుజ్జుల సుధాకరరెడ్డి మెమోరియల్ బాలబాలికల అండర్-13, 15, 17 తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలను శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు డాక్టర్ కె.సావిత్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులో జరుగుతాయని వివరించారు. సుమారు 500 ఎంట్రీలు వచ్చాయని పేర్కొన్నారు. విజేతలకు మొత్తం రూ.2 లక్షల వరకు నగదు పారితోషికాలతోపాటు ట్రోఫీలు అందజేస్తామని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి టి-షర్ట్ ఇస్తామని పేర్కొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.900, గరిష్ట ధర రూ.2,000, మోడల్ ధర రూ.1,400 వరకు పలికింది.

వైద్యా 'వంద'నం

- చిలకలూరిపేటకు వంద పడకల ఆస్పత్రి వరం
- మొత్తం రూ.30 కోట్లతో పనులు
- అట్టహాసంగా ప్రారంభోత్సవం
- ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి..
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: అభివృద్ధి అంటే ఏమిటో చేతల ద్వారా చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో కొత్తగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వాస్పత్రి భవన సముదాయాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ముందుగా ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రిలో గత టీడీపీ పాలనలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు మాత్రమే ఉండేవారని గుర్తు చేశారు. వైద్య సిబ్బందితో కలిపి 15 మంది లోపే ఇక్కడ సేవలు అందించేవారని చెప్పారు. గతంలో రోజుకు 20 నుంచి 30 ఓపీ మాత్రమే నమోదయ్యేదని వివరించారు. ఆస్పత్రి భవనం పాడుబడి ఉండేదని వైద్య పరికరాలు ఉండేవి కావని, వైద్య పరీక్షలు నామమాత్రంగా ఉండేవని, మందులు కూడా అంతంత మాత్రం అందుబాటులో ఉండేవని గుర్తు చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిలకలూరిపేట ప్రభుత్వాస్పత్రి రూపు రేఖలు పూర్తిగా మార్చేశామని చెప్పారు. సీహెచ్‌సీ నుంచి ఏరియా ఆస్పత్రి స్థాయికి పెంచామని పేర్కొన్నారు. ఏకంగా 96 పోస్టులు మంజూరు చేసి నియామకాలు పూర్తి చేశామన్నారు. ఇప్పుడు ఆస్పత్రిలో డాక్టర్లే 23 మంది ఉన్నారని వెల్లడించారు. రూ.2 కోట్లతో అత్యాధునిక వైద్య పరికరాలు కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పుడు ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. ఓపీ రోజుకు 300 నుంచి 350కు పెరిగిందని తెలిపారు.

రూ.30 కోట్లతో అభివృద్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాస్పత్రిని ఏకంగా రూ.30 కోట్లతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని మంత్రి రజిని చెప్పారు. కొత్త భవన నిర్మాణానికి రూ.18.57 కోట్లు ఖర్చు చేశామన్నారు. రూ.9.5 కోట్లతో రిటైనింగ్‌వాల్, ఆస్పత్రి ప్రాంగణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఈ రోజు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. నిధులూ మంజూరయ్యాయని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఈ ఆస్పత్రిలో 1, 2 స్పెషాలిటీ సేవలు మాత్రమే అందుబాటులో ఉండగా ఇప్పుడు అన్ని రకాల స్పెషాలిటీ సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.

రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అదనంగా నిధులు

తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి.. భవనాన్ని అలా నిర్మించడానికి వీల్లేదని అప్పట్లో అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక ఫ్లోర్ మొత్తాన్ని ఫౌండేషన్ కిందకు మార్చి సురక్షితంగా ఉండేలా భవన నిర్మాణం చేశామని వివరించారు. ఆ మేరకు ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించుకోగలిగామని వెల్లడించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణానికి కూడా సీఎం జగనన్న అదనంగా నిధులు ఇచ్చి పేట ప్రజలకు ఎంతో మేలు చేశారని పేర్కొన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ ఆస్పత్రి అందించే అత్యాధునిక వైద్య సేవలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ బి.చంద్రశేఖరరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ కార్యదర్శి డాక్టర్ మంజుల, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, డీఎఫ్‌వో ఆర్ రామచంద్రరావు, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ శోభారాణి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్ మల్లెల రాజేష్‌నాయుడు, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఆసుపత్రి భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

నాడు నిర్మాణ పనుల్లో లోపాలు

చిలకలూరిపేటలో ఆస్పత్రికి కొత్త భవనాన్ని నిర్మించాలనే ఆలోచన గత పాలకులకు కేవలం ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాత్రమే గుర్తుకొచ్చిందని మంత్రి రజిని విమర్శించారు. ఎన్నికలకు ముందు హడావుడిగా పనులు మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. భవన నిర్మాణంలో ఎన్నో లోపాలు ఉన్నా.. ఓగేరువాగు నుంచి ముంపు సమస్య ఉత్పన్నమయ్యేలా భవన నిర్మాణం డిజైన్ ఉన్నా.. అవేవీ పట్టించుకోకుండా అప్పటికే ఉన్న పాత ఆస్పత్రి కంటే తక్కువ ఎత్తులో ఓగేరువాగు పొంగితే ముంపునకు గురయ్యేంతటి దుస్థితిలో నాడు భవన నిర్మాణ పనులు ప్రారంభించారని విమర్శించారు.



ఆపరేషన్ థియేటర్ పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

టీడీపీ పాలనలో అంతా దోపిడీ

టీడీపీ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదని మంత్రి విడదల రజిని విమర్శించారు. బైపాస్ నిర్మాణాన్ని గత పాలకులు ఆదాయ వనరుగా చూశారని, అందుకే బైపాస్ నిర్మాణం గత పాలనలో కలగానే మిగిలిపోయిందని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చాక బైపాస్ నిర్మాణ పనులు శరవేగంగా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టాక అమృత్ పథకం ద్వారా నిధులు తీసుకొచ్చి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టామని వెల్లడించారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. గురుకుల పాఠశాలల విద్యార్థులకు కొత్త భవనాలు కట్టించామని చెప్పారు. రాజాపేటలో ఇప్పటికే ఓ భవనం ప్రారంభించామని, బోయపాలెంలో మరో కొత్త భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. కేంద్రీయ విద్యాలయాన్ని కూడా నియోజకవర్గానికి తీసుకువచ్చామని వెల్లడించారు.

96.57 శాతం పెన్షన్ల పంపిణీ



నెహ్రూనగర్(గుంటూరు): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ గుంటూరు జిల్లాలో గురువారం సాయంత్రానికి 96.57 శాతం పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఈ నెలలో 2,49,667 మంది లబ్ధిదారులు ఉండగా వారి కోసం ప్రభుత్వం రూ.68.59 కోట్లు కేటాయించింది.

యార్డుకు 30,243 బస్తాల మిర్చి రాక



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 30,243 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 28,370 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్‌ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10 వేల నుంచి 26 వేల వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.22 వేల వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 25 వేల వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5 వేల నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,597 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఆలపాటి ఔటేనా! తెనాలి లేనట్టేనా!!

- నాదెండ్లను గెలిపించాలని పవన్ పిలుపు
- జనసేనది ఏకపక్ష ప్రకటన అంటున్న టీడీపీ సీనియర్లు
- నీపని నీదేనని ఆలపాటికి బాబు ఇదివరకే భరోసా

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెనాలి నుంచి మాజీమంత్రి ఆలపాటి రాజా ప్రస్థానం ముగిసినట్లేనా? రాబోయే శాసనసభ ఎన్నికల్లో తెనాలి నుంచి జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను గెలిపించాలంటూ తెనాలి కార్యకర్తల సమావేశంలో పవన్ కళ్యాణ్ ప్రకటించడం ఈ చర్చకు దారి తీసింది. ఇంకా పొత్తులు సంగతి ఖరారు కాకుండానే ఏకపక్షంగా జనసేన తమ అభ్యర్థిని ప్రకటించడం పట్ల తెలుగుదేశం శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తమకు బలమైన సీటులో అభ్యర్థిని ఏకపక్షంగా ఎలా ప్రకటిస్తారంటూ వారు మండిపడుతున్నారు. మరోవైపు నీ పని నీదేనని ఆలపాటికి టీడీపీ అధినేత చంద్రబాబు ఇదివరకే భరోసా ఇచ్చారనేది విశ్వసనీయ సమాచారం.

గుంటూరు పశ్చిమంపై దృష్టి!

గతంలో పొన్నూరు, తెనాలి, బాపట్ల, చీరాలలో చంద్రబాబు పర్యటనను ఖరారు చేశారు. తీరా ఒకరోజు ముందు తెనాలి పర్యటనను రద్దుచేసుకుని చంద్రబాబు నేరుగా బాపట్లకు వెళ్లారు. అక్కడ టీడీపీ అభ్యర్థిని ప్రకటించారు కూడా. తెనాలి అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోకపోవటం, పొత్తులపై అనధికారంగా చేతులు కలిపినందున మనోహర్ కోసం తెనాలి సీటు వదులుకోవటానికి సిద్ధపడటం వంటి కారణాలతో తెనాలి పట్టణంలో పర్యటనను చంద్రబాబు రద్దుచేసుకున్నారని అప్పట్లో చెప్పుకున్నారు. అప్పటి నుంచే ఆలపాటి రాజా భవితవ్యం చర్చనీయాంశంగా మారింది. తాజాగా పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటనతో ఈ విషయం స్పష్టం అవుతోంది. తెనాలి సీటు విషయంలో అనుమానాలు ఉండటంతోనే ఆలపాటి రాజా గుంటూరు పశ్చిమంపైనా దృష్టి పెట్టారు. అయితే ఆలపాటి రాజాను ఎంపీగా పంపుతారంటూ ఒక ప్రచారం జరుగుతోంది. చివరి నిముషంలో ఆలపాటి రాజాకు చంద్రబాబునాయుడు మొండిచెయ్యి చూపిస్తారంటూ తెలుగుదేశం శ్రేణులు గుసగుసలాడుతున్నాయి.

మనోహర్‌కు గత ఎన్నికల్లో స్వల్ప ఓట్లు

గతంలో రెండుసార్లు తెనాలి నుంచి గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్పీకర్‌గా కూడా పనిచేసిన నాదెండ్ల మనోహర్ 2014లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి కేవలం 15 వేల ఓట్లు, 2019లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసి 29 వేల ఓట్లు పొందారు. 2014లో గెలిచిన ఆలపాటి రాజా, 2019లో 76 వేల ఓట్లు సంపాదించారు. తెనాలిలో బలంగా ఉన్న ఆలపాటి రాజాకు పొత్తుల రూపంలో రాజకీయ ప్రస్థానానికి ఎండ్‌కార్డు పడుతుందా అన్న చర్చ తెలుగుదేశంలో జరుగుతోంది.

వాడుకుని వదిలేయడమే బాబు తీరు

వాస్తవానికి ఏ ఎన్నికలకు అప్పటి పరిస్థితుల ప్రకారం నిర్ణయం తీసుకోవటం చంద్రబాబుకు అలవాటు. పార్టీకి విధేయత వంటివి ఆయన పట్టించుకోరు. వాడుకుని వదిలేయటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. తెనాలి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థుల విషయాన్ని పరిశీలించినా ఈ విషయం తెలిసిపోతుంది. 1994 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ రావి రవీంద్రనాథ్‌ను పార్టీలో చేర్చుకుని, ఆ ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇచ్చారు చంద్రబాబు. ఎమ్మెల్యేగా ఒక టర్మ్ పూర్తిచేసుకున్న డాక్టర్ రవీంద్రనాథ్‌కు 1999 ఎన్నికల్లో రెండోసారి టికెట్ ఇవ్వకుండా చంద్రబాబు మొండిచెయ్యి చూపారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి చెందిన వైద్యురాలు డాక్టర్ గోగినేని ఉమకు అభ్యర్థిత్వం కట్టబెట్టారు. ఆ ఎన్నికల్లో గెలిచిన డాక్టర్ ఉమ, 2004లో మళ్లీ టీడీపీ తరపున పోటీచేసి ఓటమి చెందారు. ఆ తర్వాత 2009 ఎన్నికలకు వేమూరు ఎస్సీలకు రిజర్వుడు కావటంతో ఆ నియోజకవర్గానికి చెందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను తెనాలి నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. డాక్టర్ ఉమను కొనసాగించలేదు. అయినా ఆ ఎన్నికల్లో ఆలపాటి ఓటమి పాలయ్యారు. 2014లోనూ అదృష్టాన్ని పరీక్షించుకున్న ఆలపాటి రాజా ఎమ్మెల్యేగా గెలుపొందారు. మళ్లీ 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ చేతిలో ఓడిపోయారు. తెనాలి నుంచి మూడుసార్లు పోటీచేసి ఒకసారి గెలిచిన ఆలపాటికి మరోసారి చంద్రబాబు సీటు ఇస్తారనేది డౌటేనని అంటున్నారు. అయితే ఏకపక్షంగా జనసేన అభ్యర్థిని ప్రకటించడంతో భవిష్యత్ కార్యాచరణపై తెలుగుదేశం శ్రేణులు చర్చించుకుంటున్నాయి.

మెము రైళ్లలో సౌకర్యవంత బోగీలు

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ప్రస్తుతం ఉన్న పలు మెము (మెయిన్ ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్) రైళ్లలో సౌకర్యవంత సీటింగ్ విధానంతోపాటు మరుగుదొడ్లతో కూడిన బోగీలను అందుబాటులోకి తీసుకు రావాలని రైల్వే అధికారులకు పలుమార్లు విన్నవించామని, ఫలితంగా స్పందించిన రైల్వేశాఖ ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందని నరసారావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం నుంచి మెము రైళ్లలోనూ సౌకర్యవంత బోగీలను అందుబాటులోకి తీసుకురానున్నట్టు రైల్వే శాఖ పేర్కొందని వివరించారు. విజయవాడ-గుంటూరు(07783), గుంటూరు-మాచర్ల(07779), మాచర్ల-నడికుడి(07580), నడికుడి-మాచర్ల(07579), మాచర్ల-గుంటూరు(07780), గుంటూరు విజయవాడ(07788) రైళ్లలో మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. రైల్వే శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేఎల్‌యూలో అంతర్జాతీయ గణిత కార్యశాల

తాడేపల్లిరూరల్: కేంద్ర డీఎస్టీ సెర్బ్‌వారి సౌజన్యంతో ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్.విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ గణిత కార్యశాలను నిర్వహించనున్నట్లు గణిత విభాగ అధిపతి డాక్టర్ బి.వి.అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4, 5 తేదీలలో నిర్వహించనున్న ఈ కార్యశాలకు దేశ విదేశాల నుంచి గణిత మేధావులు, శాస్త్రవేత్తలు విచ్చేయనున్నారని, ఆధునిక గణిత పద్ధతులను వివిధ విభాగాలలో సులువుగా, ఖచ్చితత్వంతో ఏ విధంగా ఉపయోగించాలో వివరించనున్నారని, సుమారు వివిధ దేశాల నుంచి 125 మంది గణిత మేధావులు ఆయా విభాగాల నుంచి పాల్గొంటారని తెలిపారు.

17 నుంచి శ్రావణ మాసోత్సవాలు

దుర్గగుడికి శ్రావణమాస శోభ

విజయవాడ: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఈనెల 17 నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. రెండో శుక్రవారమైన 25న వరలక్ష్మి వ్రతాలను పురస్కరించుకుని అమ్మవారు వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. నాల్గో శుక్రవారమైన సెప్టెంబర్ 8న ఆలయంలో ఉచితంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తారు. ఈ సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో భక్తులు పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పిస్తోంది. ఆర్జిత సేవగా నిర్వహించే ఈ వ్రతంలో పాల్గొనే భక్తులు రూ.1500 టికెటు కొనుగోలు చేయాల్సి ఉంది. మహా మండపం ఆరో అంతస్తులో వ్రతాలను నిర్వహిస్తారు.

ఆరంభమైన ఫిజియో లీగ్ టీ-20 క్రికెట్ పోటీలు



క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న అతిథులు క్రీడాకారులు

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ ఫిజియోథెరపిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించే రాష్ట్రస్థాయి 'ఫిజియో లీగ్ టీ-20' క్రికెట్ పోటీలు గురువారం ప్రారంభించారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరం ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల క్రికెట్ క్రీడా మైదానంలో, నంబూరులోని ఎమ్మెస్‌కే క్రీడా మైదానాలలో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చౌడవరం ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎస్.శరత్‌చంద్ర మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో మానవజాతి అంతటినీ ఒకచోట చేర్చి సుహృద్భావ వాతావరణంలో క్రీడా స్ఫూర్తిని క్రికెట్ అందిస్తున్నదని తెలియజేశారు. ఫిజియో లీగ్ టీ-20 చైర్మన్ డాక్టర్ ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ కేవలం ఫిజియోథెరపీ డాక్టర్లతో 8 టీంలతో ఐదు రోజులపాటు ఈ క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. విన్నర్ జట్టుకు లక్ష రూపాయల నగదు రోలింగ్ ట్రోఫీ, రన్నర్స్ జట్టుకు 50 వేల రూపాయల నగదు షీల్డ్ అందిస్తున్నట్లు తెలియజేశారు. ఐదు రోజుల పాటు జరిగే లీగ్ క్రికెట్ పోటీలను టీవీ 2 చానల్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రసారం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్తలు శివప్రసాద్, ముప్పరాజు వెంకట్రావు, డాక్టర్ షేక్ సుభాని, డాక్టర్ ఏడుకొండలు, రాజేష్ రోషన్, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ జోత్స్న తేజ పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

రూ.50 లక్షల మేర అనధికారిక ప్యాకింగ్ నిల్వల గుర్తింపు



షాపులో నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి వాసంతి

నరసరావుపేట టౌన్: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని వాసవీ షాపింగ్ కాంప్లెక్స్‌లో అనధికారికంగా ఉన్న మైక్రో న్యూటియన్స్ ఫర్టిలైజర్స్, మెగ్నీషియమ్ సల్ఫేట్ నిల్వలను గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారులు గురువారం పట్టుకున్నారు. వీటి విలువ సుమారుగా రూ.50 లక్షల మేర ఉంటుందని అంచనా. గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయాధికారి వాసంతి కథనం ప్రకారం విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక రెవెన్యూ, వ్యవసాయాధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. వాసవీ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపు నంబరు 114కు చెందిన సురేష్ అనే వ్యక్తిని ఫోన్ ద్వారా సంప్రదించి దుకాణాన్ని తెరవాలని కోరారు. ఆ వ్యక్తి తాను తిరుపతిలో ఉన్నట్లు తాళాలు పంపిస్తానని చెప్పాడు. అయితే ఎంతకీ రాకపోవడంతో రెవెన్యూ అధికారుల సమక్షంలో తాళాలు పగలగొట్టి దుకాణాన్ని తెరచి చూడగా ముడిసరుకు, ప్యాకింగ్ పరికరాలు, పాకెట్లు లభ్యమయ్యాయి. అనధికారికంగా మైక్రో న్యూటియన్స్ ఫర్టిలైజర్స్ నిల్వచేసి వాటిని గుంటూరులోని శ్రీనిధిపేరుపై కేజీ పాకెట్లుగా పాకింగ్ చేస్తున్నారని వాసంతి వెల్లడించారు. దుకాణ యజమాని అగ్రి ఏజెన్సీ పేరుతో లైసెన్స్ తీసుకొని అదే కాంప్లెక్స్‌లో 174 నంబరు షాపులో వ్యాపారం చేస్తున్నాడని, ఆ షాపునూ తెరిచామని, అక్కడ అనధికారికంగా కేజీ బరువుగల 50 పాకెట్లు ఒక బస్తాలో వేసి నిల్వచేసి ఉన్నాయని పేర్కొన్నారు. బిల్లు పుస్తకాలేమీ లభ్యం కాలేదని వివరించారు. 114 షాపులో ఇతరత్రా స్టాకు చాలా ఉందని వివరించారు. వాటిని లెక్కించాల్సిన అవసరం ఉందని, సుమారుగా రూ.50 లక్షలు ఉండవచ్చని అంచనా వేస్తున్నామని వెల్లడించారు. సదరు వ్యక్తికి మెటీరియల్ తీసుకొచ్చి ప్యాకింగ్ చేసేందుకు లైసెన్స్ లేదని, కేవలం మార్కెటింగ్‌కు మాత్రమే అనుమతి ఉందని వివరించారు. దీనిని సీజ్ చేసి స్థానిక వ్యవసాయాధికారులకు స్వాధీనం చేస్తున్నామని పేర్కొన్నారు. ఫర్టిలైజర్స్ షాపుపై 6ఏ కేసు పెడతామని చెప్పారు. లైసెన్స్‌లేకుండా శ్రీనిధి, గుంటూరు వారిపేరుపై ప్యాకింగ్ చేస్తున్నందుకు సదరు వ్యక్తిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రారెడ్డి, స్థానిక వ్యవసాయాధికారి నరేంద్రబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపెట్‌లో ఎస్సీ, ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరుఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఎస్సీ, ఎస్టీ హబ్ పథకం ద్వారా మంది అభ్యర్థులకు మెషీన్ ఆపరేటర్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ కోర్సులో ఆర్నెల్లపాటు ఉచిత శిక్షణ కల్పించి, సర్టిఫికెట్‌తో పాటు అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూరు, చెన్నై ప్రాంతాల్లోని ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా వ్యవస్థాపకులుగా సైతం అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలను కల్పిస్తామని, ఆసక్తి గల అభ్యర్థులు టెన్త్ ఉత్తీర్ణతతో పాటు 18 ఏళ్ల వయసు నిండి ఉండాలని సూచించారు. వివరాలకు తమ ప్రతినిధి అంజినాయక్‌ను 7893586494 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'జగనన్న సురక్ష' చరిత్ర సృష్టించింది

- తక్కువ వ్యవధిలో ఎక్కువ సర్టిఫికెట్లు అందజేశాం
- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం దేశంలోనే చరిత్ర సృష్టించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు 30 రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందకుండా మిగిలిపోరాదన్న లక్ష్యంతో ప్రజలకు అవసరమైన సేవలు అందించేలా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించటం జరిగిందన్నారు.

అతి తక్కువ వ్యవధిలో సేవలు..

రాష్ట్ర చరిత్రలో అతి తక్కువ వ్యవధిలో అత్యధిక సేవలు అందించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించారన్నారు. 1.46 కోట్ల కుటుంబాలను వలంటీర్లు సర్వే చేసి ప్రజలకు వివిధ రకాలైన సేవలను నమోదు చేసుకున్నారన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. శిబిరాలలో 93.5 లక్షలకు పైగా అభ్యర్థనలు పరిష్కారం అయ్యాయన్నారు. జూలై 18వ తేదీన ఒక్క రోజే 7.54 లక్షల సర్టిఫికెట్లను అందజేయటం జరిగిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు 45.33 లక్షలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 41.50 లక్షలు, ఆధార్‌మొబైల్ అప్లికేషన్స్ 2.7 లక్షలు, అడంగల్ సర్టిఫికెట్లు 1.40 లక్షలు, రెవెన్యూ హక్కుల రికార్డు, ల్యాండ్ టైటిల్స్ 2.70 లక్షలు ప్రజలకు అందించటం జరిగిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేసిన 1.9 లక్షల మంది వలంటీర్లు, 1200 మంది మండల అధికారులు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

నూరుశాతం పథకాలు అందజేయడమే లక్ష్యంగా..

జిల్లా స్థాయిలో కలెక్టర్లు, జిల్లా అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమ విజయవంతానికి ప్రత్యేక భూమిక పోషించారన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో మొత్తం 99,978 గృహాలను సర్వే చేయటం జరిగిందని, 100 క్యాంపులు నిర్వహించటం జరిగిందన్నారు. క్యాంపులలో 50,493 అర్జీలు నమోదు కాగా, వాటిని అక్కడికక్కడే 96 శాతం, 48,585 ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి 100 శాతం పథకాలు అందజేయాలనేది జగనన్న లక్ష్యమని తెలిపారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడంతేనని గర్వంగా చెబుతున్నామన్నారు.

దగ్గరలో దూరవిద్య!

- ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం
- ఈనెలాఖరు వరకు అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు



దూరవిద్య తరగతులకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: చదువుకోవాల్సిన వయసులో విద్యకు దూరమైన వారు తాము విద్యావంతులం కాలేకపోయామని చింతించాల్సిన పనిలేదు. ఎందుకంటే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీఓఎస్ఎస్) దూర విద్యావిధానం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తోంది. చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలను భుజానికెత్తుకుని దైనందిన జీవితంలో వివిధ వృత్తుల్లో నిమగ్నమైన వారికి మరలా చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. చదువుకు దూరమైన, బడిమధ్యలో మానేసిన వారితో పాటు పదో తరగతి తప్పినవారికి, టెన్త్ చదివే సామర్థ్యం కలిగి, ఎటువంటి విద్యార్హత లేనప్పటికీ 14 ఏళ్ల వయసు నిండిన వారందరూ 10వ తరగతిలో ప్రవేశం పొందవచ్చు. అదేవిధంగా టెన్త్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో ప్రవేశం పొందే వీలుంది. రెగ్యులర్ ఇంటర్‌తో సమాన గుర్తింపు కలిగిన దూరవిద్య ఇంటర్‌ను ఏడాది వ్యవధిలోనే పూర్తి చేయవచ్చు. 2023–24 విద్యాసంవత్సరానికి ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ టెన్త్, ఇంటర్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేసింది. దూరవిద్య టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరిన అభ్యర్థులకు ఏపీఓఎస్ఎస్ ప్రతి ఆదివారం కాంటాక్ట్ తరగతులను నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లోని నిష్ణాతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులే స్వయంగా తరగతులను బోధిస్తారు.

ఈనెలాఖరు వరకు ప్రవేశాలు..

దూర విద్య టెన్త్, ఇంటర్లో ప్రవేశానికి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈనెల 31వ తేదీవరకు అడ్మిషన్ ఫీజు చెల్లించవచ్చు. టెన్త్‌లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి పాటు జనరల్ కేటగిరీ పురుషులు రూ.1,550, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎక్స్ సర్వీస్ మెన్ పిల్లలు, శారీరక వైకల్యం గల వారు రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు రూ.1,150 చెల్లించాలి. ఇంటర్లో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ ఫీజుతో కలిపి జనరల్ కేటగిరీకి చెందిన పురుషులు రూ.1,800, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎక్స్ సర్వీస్ మెన్ పిల్లలు, శారీరక వైకల్యం గల అభ్యర్థులు రూ.1,500 చెల్లించి ఇంటర్నెట్ కేంద్రాలు, ఏపీ ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంది. అభ్యర్థులు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంది.

ముమ్మరంగా ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యం పంపిణీ

- పలుచోట్ల పంపిణీ తీరును పరిశీలించిన డీఎస్‌వో
- మూడురోజుల్లో 1,24,808 మందికి బియ్యం అందజేత



పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లో ఎండీయూ వాహనం వద్ద రేషన్ బియ్యం తీసుకెళుతున్న లబ్ధిదారులు

నరసరావుపేట: జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం తెలుపు రంగు రేషన్ కార్డు దారులకు ఈనెల నుంచి నూతనంగా అందజేస్తున్న ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యం పంపిణీ ముమ్మరంగా సాగుతుంది. గురువారం సాయంత్రానికి జిల్లాలో 1,24,808 మందికి ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే వెళ్లి డీలర్లు పంపిణీ చేశారు. జిల్లాలో జరుగుతున్న పంపిణీ తీరును జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎస్.పద్మశ్రీ పరిశీలించారు. ముప్పాళ్ల, నరసరావుపేట పట్టణంలోని బరంపేటలో ఎండీయూ వాహనాల ద్వారా జరుగుతున్న బియ్యం పంపిణీని తనిఖీ చేశారు. ఆ సమయంలో రేషన్ తీసుకెళ్లేందుకు వచ్చిన లబ్ధిదారులకు ఫోర్టిఫైడ్ బియ్యం విశిష్టతను వివరించారు. పట్టణంలోని లబ్ధిదారులకే కేజీ రూ.16లకే ఫోర్టిఫైడ్ గోధుమపిండి ప్యాకెట్‌ను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈనెల 17వ తేదీలోగా జిల్లా వ్యాప్తంగా 1289 రేషన్ షాపుల ద్వారా 402 ఎండీయూ వాహనాలతో 6,36,405 మంది కార్డుదారులకు పంపిణీ పూర్తిచేస్తామని డీఎస్‌వో తెలిపారు.

రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలి

బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్



చుండూరు(వేమూరు): రెవెన్యూ అధికారులు రీసర్వే త్వరగతిగా పూర్తి చేయాలని బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ఆదేశించారు. చుండూరు రెవెన్యూ గ్రామంలో పొలాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుండూరు గ్రామం రీసర్వేకు ఎంపికయిందన్నారు. అందువల్ల రెవెన్యూ శాఖ అధికారులు రీ సర్వే త్వరగతి పూర్తి చేయాలని ఆయన సూచించారు. గతేడాది చుండూరు మండలంలోని తొట్టెంపూడి గ్రామంలో రీ సర్వే పూర్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది చుండూరు రెవెన్యూ గ్రామం పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. తహసీల్దార్ కనక దుర్గ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హర్ష.. విజయ పదనాసా



నాసాలో హర్షవర్ధన్‌రెడ్డి (ఫైల్)

ప్రతిభ, పట్టుదల ఉంటే ఎదుగుదలకు పేదరికం ఏమాత్రం అడ్డురాదని నిరూపించాడు ఏటుకూరు యువకుడు. మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి, అంచెలంచలుగా ఎదుగుతూ ప్రతిష్టాత్మకమైన 'నాసా' సంస్థలో ఉన్నత ఉద్యోగానికి ఎంపికై, ఎందరికో ఆదర్శంగా నిలిచాడు. నగర శివారుల్లోని ఏటుకూరులో నివాసం ఉంటూ ప్రైవేటు స్కూళ్లల్లో టీచర్లుగా పనిచేసే నర్రావుల శివపార్వతి, ఈశ్వర్‌రెడ్డి దంపతుల పెద్ద కుమారుడైన హర్షవర్ధన్ రెడ్డి నాసాలో ఉద్యోగానికి ఎంపికై చిన్ననాటి నుంచి తాను కంటున్న కలలు నెరవేర్చుకున్నాడు. ఐఐటీ గౌహతిలో చదివిన హర్షవర్ధన్ రెడ్డి ఇంజినీరింగ్‌లో ఇంటర్న్‌షిప్ కోసం కెనడా వెళ్లాడు. అనంతరం అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసేందుకు దరఖాస్తు చేసుకుని సీటు సంపాదించాడు. పీహెచ్‌డీ పూర్తి చేస్తున్న సమయంలోనే నాసాలో ఉద్యోగాన్ని సంపాదించాడు. గతనెల 12వ తేదీన నాసాలో విధుల్లో జాయిన్ అయ్యాడు. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే లక్ష్యాన్ని సాధించానని హర్షవర్ధన్ రెడ్డి తెలిపారు.

– గుంటూరు రూరల్

రైలు నుంచి జారిపడి బిహార్ వాసి మృతి

చీరాల రూరల్: రైలు నుంచి జారిపడి బిహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన గురువారం వేటపాలెం–చినగంజాం రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. బిహార్ రాష్ట్రం పూరియా జిల్లా జమిరా గ్రామానికి చెందిన దిల్వార్ హుస్సేన్ (48) బెంగళూరులో కూలి పనులు చేస్తుంటాడు. ఈక్రమంలో దిల్వార్ తన తోటి గ్రామస్తులు, బంధువులతో కలసి కిషన్‌గంజ్ రైల్వే స్టేషన్‌లో బెంగళూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు దిల్వార్ మరుగుదొడ్డి వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి వేటపాలెం–చినగంజాం రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై పడిపోయాడు. ఈఘటనలో అతని తలకు బలమైన రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రుల చెంతకు..


గంటలోపే పాప ఆచూకీ కనుగొన్న పోలీసులు



పాపను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న టూటౌన్ సీఐ సోమశేఖర్

చీరాల: తప్పిపోయిన చిన్నారి ఆచూకీని గంటలోపే కనుగొని పోలీసులు పాపను తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని నోవాహుపేటకు చెందిన కాకి వినోద్‌కుమార్ కుమార్తె ఐదేళ్ల విషిత రూత్ గురువారం రాత్రి 7గంటల నుంచి కనిపించలేదు. దీంతో పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో 112 కాల్ సెంటర్‌కు కాల్ చేశాడు. కాల్ సెంటర్ నుంచి వచ్చిన సమాచారంతో టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ విషయాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, డీఎస్పీ ప్రసాదరావుకు తెలిపారు. వారి ఆదేశాల మేరకు రెండు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఒక బృందం సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా, మరో బృందం వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో చిన్నారి ఆటోలో ఉండడాన్ని గమనించి ఆటో డ్రైవర్ డేనియల్‌ను ప్రశ్నించారు. పాప రోడ్డుకు అడ్డం రావడంతో చిన్నారి వాళ్ల ఇంటి దగ్గర దింపమని అడిగిందని, ఈ సందర్భంలో పాపను ఆటోలో ఎక్కించుకుని వెళ్లినట్లు తెలిపాడు. సీఐ ఆపాప తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌ను పిలిపించి వారికి అప్పగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలని, అశ్రద్ధ వహించవద్దని సీఐ సూచించారు. ఏ సమస్య వచ్చినా 100, 112 నంబర్లుకు, బాపట్ల జిల్లా ఎస్పీ హెల్ప్‌లైన్ నెంబర్ 83338 13228కు కాల్ చేయాలన్నారు. పాప ఆచూకీని కనుగొనడంతో టూటౌన్ సీఐ సోమశేఖర్, మహిళా ఎస్ఐ చంద్రావతి, హెడ్ కానిస్టేబుల్ ఎస్‌కె బాజీత్, డి.శివప్రసాద్, కానిస్టేబుళ్లు ఎం.శ్రీనివాసులు, బాలశంకర్, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

పోటీ చివరి వరకు క్రీడాకారుడు సత్తా చాటాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: క్రీడా పోటీల్లో విజేత ఒకరే కావచ్చు...కానీ ప్రతి ఆటగాడు గెలవాలన్న స్ఫూర్తితోనే తమ ప్రతిభా పాటవాలను చూపాలని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి అన్నారు. చిలకలూరిపేట మండలం మద్దిరాల నవోదయ విద్యాలయంలో మూడు రోజులపాటు జరిగే రీజినల్ స్థాయి ఖో–ఖో పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రవిశంకర్ క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. జవహర్ నవోదయ విద్యాలయ విద్యా సమితి, హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబార్, లక్షద్వీపులు రాష్ట్రాల్లోని 77 జేఎన్‌వీ విద్యాలయాల్లోని 471 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు హాజరయ్యారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎస్పీ రవిశంకర్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో విద్యకంటే ముందు ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందన్నారు. ఆటలతోనే ఆరోగ్యవంతమైన జీవితం లభిస్తుందన్నారు. అందుకే ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. ఉపాధ్యాయులు కూడా వీటిపై ఆసక్తి కలిగేలా అవగాహన కల్పించి ప్రాథమిక స్థాయి నుంచే వారిని ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనడమే తొలి గెలుపుగా భావించి ఉత్సాహంగా ముందుకు రావాలన్నారు. యూబీఐ పల్నాడుజిల్లా రీజినల్ మేనేజర్ డి శంకరరావు, చిలకలూరిపేట ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పేర్ని రాఘవరెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి అలాగే శారీరక దృఢత్వానికి ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడాకారుడు స్నేహపూరిత వాతావరణంలో పోటీల్లో ఆడాలని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మద్దిరాల జేఎన్‌వీ ప్రిన్సిపాల్ ఎన్ నరసింహారావు మాట్లాడుతూ గురు, శుక్ర, శనివారాలు మూడు రోజులు విద్యాలయంలో హైదరాబాద్ రీజియన్ స్థాయి ఖో–ఖో పోటీలు కొనసాగుతాయన్నారు. అండర్ –14, అండర్–17, అండర్ –19 విభాగాల్లో బాలికలు, బాలురకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో విజేతలైన జట్లు త్వరలో రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే అర్హతను సంపాదిస్తారన్నారు.

టీడీపీ 40 వేల దొంగ ఓట్లు చేర్చింది

వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్



మాట్లాడుతున్న ఆమంచి

పర్చూరు (చినగంజాం): పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ 40 వేల దొంగ ఓట్లను తన మద్దతుదారులతో చేర్పించిందని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా పర్చూరు పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ దొంగఓట్ల ప్రభావంతో గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి 1500 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారన్నారు. ఆదొంగ ఓట్లు లేకపోతే మా అభ్యర్థి 15 వేల ఓట్ల మెజార్టీతో గెలిచేవారన్నారు. 2014 ఎన్నికలకు ముందు 20 వేలు, 2019 ఎన్నికలకు ముందు 20 వేల ఓట్లను టీడీపీ నాయకులు అప్పటి డేటా ఎంట్రీ ఆపరేటర్ సహకారంతో దొంగతనంగా చేర్పించినట్లు ఆరోపించారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్, వైఎస్సార్ సీపీల మధ్య వైరం జరుగుతున్న తరుణంలో దానిని అదునుగా చూసుకొని టీడీపీ భారీ ఎత్తున దొంగ ఓట్లను చేర్పించిందన్నారు. ఒక్క కారంచేడులోనే 2600 దొంగ ఓట్లు ఉండటంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కారంచేడు మండలం తిమిడెదపాడులోకూడా 300 దొంగ ఓట్లున్నాయని ఆయన తెలిపారు. పెళ్లి వెళ్లిపోయిన వారి ఓట్లు కూడా ఇంకా పుట్టింటి దగ్గరే ఎలా ఉంటాయని ఆయన ప్రశ్నించారు. విదేశాల్లో ఉన్న వారి దొంగ ఓట్లు మూడు వేల వరకు ఉన్నాయన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారి దొంగ ఓట్లు 14 వేలు ఉన్నాయని, ఆస్తులు, ఆధార్ కార్డులు ఇక్కడివి ఉన్నంత మాత్రాన ఇక్కడే ఓటు ఉండాలనే నిబంధనలేమి లేవన్నారు. మనం ఎక్కడైతే నివాసముంటామో అక్కడే ఓటు హక్కు ఉండాలని వివరించారు. జూలై 21వ తేదీ నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ఓటర్ల జాబితాలో సవరణలు గురించి విచారణ చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చట్టబద్ధంగా ఉండాలన్నారు. చనిపోయిన వారి ఓట్లు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బీఎల్‌ఓలు ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మండల కన్వీనర్ కఠారి అప్పారావు, తోకల కృష్ణమోహన్, పఠాన్ కాలేషవలి, జంగా అనిల్, ఆకుల హేమంత్, సుబ్బారావు, దండా చౌదరి, కురాకుల ఇసాక్, ముప్పాళ్ల రాఘవ, ఉప్పలపాటి అనిల్ పాల్గొన్నారు.

10న వాహనాల వేలం

పట్నంబజారు: ఈనెల 10న నిర్బంధంలో ఉన్న వాహనాలకు సంబంధించి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు డీటీసీ షేక్ కరీమ్ తెలిపారు. పన్నులు చెల్లించకుండా తిరుగుతూ రవాణా శాఖ అధికారుల దాడుల్లో పట్టుబడి, నిర్బంధంలో ఉన్న 17 వాహనాలకు వేలం జరుగుతోందని వెల్లడించారు. తెనాలి ఆర్టీసీ డిపోలో ఉన్న 12 ఆటోలు, ఒక మోటారు క్యాబ్, రెండు ద్విచక్రవాహనాలు, రెండు గూడ్స్ వాహనాలకు ఈనెల 10న గుంటూరులోని ఆర్టీఏ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.